శుక్రవారం 24-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 344, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## ప్రజలకు నాకు విడదీయరాని అనుబంధం

- మీరు పరీక్షించిన సేవకుడు మోడీ
- ఇండియా బ్లాక్‌లో మతతత్వం, బంధుప్రీతి ఎక్కువ
- హరియాణా ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ

**ముందడుగు హరియాణా:**

హరియాణా ప్రజలు నాపై ఎంతో ప్రేమను కురిపించారు. మీతో నాకు విడదీయరాని అనుబంధం ఉంది అని ప్రధాని మోడీ అన్నారు. దేశంలో సార్వత్రిక ఎన్నికల సమరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మోడీ విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. విపక్ష 'ఇండియా' నేతలపై విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా ఆయన హరియాణాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు.

విపక్ష కూటమి గురించి మాట్లాడుతూ.. ఆవు ఇంకా పాలు ఇవ్వనేలేదు. కానీ, అక్కడ నెయ్యి కోసం ఘర్షణ మొదలైందని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి పదవిని ఉద్దేశించి ఆయన ఈ మాటన్నారు. అలాగే ఐదు సంవత్సరాలకు ఐదుగురు పీఎంలు అని వారే చర్చించుకుంటున్నారని వ్యాఖ్యలు చేశారు. ''ఈ ఎన్నికల్లో మీ ఓటు ప్రధానిని ఎన్నుకోవడంతో పాటు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మీకు ఒక వైపు మీరు పరీక్షించిన సేవకుడు మోడీ ఉన్నాడు.. అవతలివైపు ఉన్న కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తున్నారో తెలీదు. ఇండియా బ్లాక్‌లో కులతత్వం, మతతత్వం, బంధుప్రీతి ఎక్కువ. మోడీ ఉన్నంతకాలం దళితులు, గిరిజనుల రిజర్వేషన్లను ఎవరూ దోచుకోలేరు.



## ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డుకు పోలీసు వాహనం

వివరాలు 4లో



## వాడిన నూనెను పదే పదే వాడితే క్యాన్సర్..?

వివరాలు 4లో



## రైలు ప్రయాణంలో ఇన్ని సేవలు పొందొచ్చు

వివరాలు 4లో

## రాష్ట్రంలో హత్య రాజకీయాలు మంచిది కాదు

- నాలుగు నెలల కాలంలో ఇద్దరి హత్యలు
- మంత్రి జూపల్లి కృష్ణారావును సస్పెండ్ చేయాలి
- అంతిమయాత్రలో పాల్గొన్న కేటీఆర్





**ముందడుగు మహబూబ్ నగర్:**

తెలంగాణలో హత్యా రాజకీయాలు మంచిది కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నాలుగు నెలల కాలంలోనే ఇద్దరి హత్యలకు కారణమైన మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో బొడ్డు శ్రీధర్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి హత్యకు జూపల్లి కృష్ణారావే బాధ్యత మిగతా 2లో

## ఆరు గ్యారంటీల్లో ఒక్క హామీ అమలైంది

- మహిళలకు ఉచిత బస్సు హామీ తుస్సే
- హనుమకొండ సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు

**ముందడుగు హన్మకొండ:**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ఒకే ఒక హామీ అమలైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ కూడా తుస్సేనని ఎద్దేవా చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఆయన హనుమకొండలో ప్రసగించారు. 'ఉపాధ్యాయ ఉద్యోగులకు నాలుగు డీఏలు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసింది. అందుకోసం అసెంబ్లీ, కౌన్సిల్‌లో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా కలిసి పోరాడతాం. నారాయణఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీఛార్జి చేసి మిగతా 2లో

## 310 కంటే ఎక్కువే గెలుస్తాం

- కాంగ్రెస్ మాత్రం 40 సీట్లకే పరిమితం
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

**ముందడుగు జాతీయం:**



దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి 310 కంటే ఎక్కువ స్థానాలను గెలుచుకుంటుందని, కాంగ్రెస్ మిగతా 2లో

ముందడుగు
శుక్రవారం, 24-5-2024, హైదరాబాద్

## రాష్ట్రంలో హత్య రాజకీయాలు
# మంచిది కాదు

మొదటిపేజీ తరువాయి

వహించాలి. ఇది మొదటి హత్య కాదు. పేరుకేమో ప్రజాపాలన.. చేస్తున్నది ప్రతీకార పాలన. ప్రతీకారంతో రగిలిపోతూ ఎన్నికల్లో వత్తాసు పలకని వారి మీద ప్రతీకారం తీర్చుకునే దిక్కుమాలిన పాలన.. ఇది కాంగ్రెస్ పాలన. ఈ హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాష్ట్రంలో ఎక్కడా లేని ఫ్యాక్షన్ సంస్కృతిని మంత్రి జూపల్లి కొల్లాపూర్‌లో తీసుకొచ్చారు. జనవరిలో మల్లేష్‌యాదవ్, ఇప్పుడు శ్రీధర్ రెడ్డి హత్యకు కారణమయ్యారు జూపల్లి. ఒకటే నియోజకవర్గంలో నాలుగు నెలల వ్యవధిలో రెండు హత్యలు జరిగాయంటే మంత్రి ప్రమేయం, ప్రోద్బలం లేకుండా ఆయన అనుచరులు ఇంత దారుణాలకు తెగబడరు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మంత్రి జూపల్లిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఐఐటీ విద్యార్థులకు కూడా ఉద్యోగాల్లేవ్

**23 ఐఐటీ క్యాంపస్‌ల్లో 8వేల మందికి జాబ్స్ రాలే ▪ ఒత్తిడి, ఆందోళనలో వేలాది మంది విద్యార్థులు**

ముందడుగు జాతీయం:

ఐఐటీ చదువులకు ఉన్న క్రేజ్ వేరు. ఎందుకంటే ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో చదివితే, మంచి కంపెనీల్లో ఉద్యోగాలు, రూ.లక్షల్లో వేతనం లాంటి ప్యాకేజీలు అని చెపుతుంటారు. కాని మన దేశంలోని ఐఐటీల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో ఈ ఏడాది దాదాపు 38శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ దక్కడం లేదు. ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి ధీరజ్‌సింగ్ సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.



ఈ ఏడాది మొత్తం 23 ఐఐటీ క్యాంపస్‌ల్లో దాదాపు 8వేల మంది (38శాతం) ఐఐటీయన్లకు ప్లేస్‌మెంట్స్ దక్కలేదని తేలింది. 2024లో 21,500 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ కోసం నమోదు చేసుకోగా.. కేవలం 13,400 మంది మాత్రమే ప్లేస్‌మెంట్స్ సాధించారని.. మిగతా వారు (38శాతం) ఇంకా కొలువుల కోసం అన్వేషిస్తున్నట్లు వెల్లడైంది. రెండేళ్ల క్రితం నాటితో పోలిస్తే ఈ పరిస్థితి దాదాపు రెట్టింపు అయినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. పాత తొమ్మిది ఐఐటీల్లో ఈ ఏడాది 16,400 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ కోసం నమోదు చేసుకోగా.. వారిలో 6,050 (37%) మందికి ఇంకా ఉద్యోగాలు దక్కలేదు. కొత్త 14 ఐఐటీల్లో అయితే ఈ పరిస్థితి మరింత క్షీణించింది. 5,100 మంది ప్లేస్‌మెంట్స్ కోసం నమోదు చేసుకోగా.. ఇంకా 2,040 మందికి కొలువులు రాలేదని తేలింది. గతేడాది కాన్పూర్ ఐఐటీ, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో 33శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ దక్కలేదని ధీరజ్‌సింగ్ తన లింక్డిన్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో సంక్షోభ పరిస్థితుల కారణంగా ఇంకా ఉద్యోగాలు రాని విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, నిస్సహాయతతో ఉన్నారని ఆయన తెలిపారు.

## ఆరు గ్యారంటీల్లో
# ఒక్క హామీ అమలైంది

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది.

నిరుద్యోగ భృతి హామీపై నిలదీస్తే.. అలా చెప్పలేదని అసెంబ్లీలో భట్టి విక్రమార్క అంటున్నారు. కరెంటు బిల్లులు, భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడానికి సిద్ధమవుతున్నారు. ఒక వైపు సంక్షేమానికి కోతలు.. మరో వైపు వాతలా? అన్నివర్గాలను మోసం చేయడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయింది. అందుకే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబితే కాంగ్రెస్ దారికొస్తుంది.'' అని హరీశ్‌రావు అన్నారు.

# 310 కంటే ఎక్కువే గెలుస్తాం



మొదటిపేజీ తరువాయి

మాత్రం 40 సీట్లకే పరిమితమవుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్, దోమరియాగంజ్, సంత్ కబీర్ నగర్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. ప్రధానంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఇప్పటివరకు జరిగిన 5 విడతల పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినట్లు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీలు బంధుప్రీతి రాజకీయాలు చేస్తున్నాయని, ఇకపై అవి మనుగడ సాగించలేవని అన్నారు.

ఓటు బ్యాంకు పోతుందన్న భయంతోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ అయోధ్య రామమందిరాన్ని దర్శించలేదని అమిత్‌షా విమర్శించారు.

## రాష్ట్రంలో 365 రోజులు
# మద్యం అమ్మండి

▪ కేరళ ప్రభుత్వం సంచలన నిర్ణయం

▪ భారీగా పెరిగిన మందుబాబుల సంఖ్య

ముందడుగు కేరళ:

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మద్యం అమ్మకాలు పెంచేందుకు డ్రైడేలను రద్దు చేయాలని నిర్ణయించింది. ఆర్థిక నిపుణులతో సమావేశమైన రాష్ట్ర చీఫ్ సెక్రటరీ వేణు ఈ మేరకు సిఫార్సు చేశారు. డ్రై డేలను రద్దు చేయడం వల్ల ప్రభుత్వానికి అదనంగా రూ.15 వేల కోట్ల ఆదాయం రాబట్టొచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం కేరళలోని రిటైల్ షాపులు లేదా బార్ అండ్ హోటళ్లలో ప్రతి నెలా ఒకటో తేదీన మద్యం అమ్మడం లేదు.

కేరళ సర్కార్ ఎక్కువగా మద్యం వల్ల వచ్చే ఆదాయం మీద ఆధారపడి ఉంది. కేరళలో మద్యం అమ్మకాల ద్వారా 202223 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి రూ.16,189.55 కోట్ల పన్నులు వస్తే...202324 ఆర్థిక సంవత్సరంలో రూ.16,609.63 కోట్లు వచ్చాయి. కేరళలో 202223లో



రూ.18,510.98 కోట్ల మద్యం విక్రయాలు ఉంటే.. 202324 ఆర్థిక సంవత్సరంలో మద్యం, బీర్ల విక్రయాలు రూ.19,088.68 కోట్లకు చేరాయి.

రాష్ట్రంలోని 3.34 కోట్ల మంది జనాభాలో 29.8 లక్షల మంది పురుషులు, 3.1 లక్షల మంది మహిళలు ఉన్నారని, వారిలో దాదాపు 32.9 లక్షల మంది మద్యం సేవిస్తున్నారని కేరళలోని మద్యం వినియోగదారుల ప్రొఫైల్ వెల్లడించింది. రోజుకు దాదాపు ఐదు లక్షల మంది మద్యం సేవిస్తున్నారు. ఇందులో 1,043 మంది మహిళలు సహా 83,851 మంది మద్యానికి బానిసలుగా మారారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ
# తుపాకుల మోత

▪ 800 మంది పోలీసులతో ఆపరేషన్

▪ ఏడుగురు నక్సలైట్లు మృతి

ముందడుగు ఛత్తీస్‌గఢ్:

ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు జరగడం తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. పోలీసులు, భద్రతా బలగాలు కలిసి మొత్తం 800 మంది చేపట్టిన ఆపరేషన్‌లో తుపాకుల మోత మోగిపోతోంది. భద్రతా బలగాలకు, నక్సలైట్లకు మధ్య జరుగుతున్న భీకర పోరుతో అడవుల్లో అలజడి నెలకొంది. ఇక ఇప్పటివరకు జరిగిన కాల్పుల్లో ఏకంగా ఏడుగురు నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. సంఘటనా స్థలంలో భారీగా ఆయుధాల డంప్, పేలుడు పదార్థాలు సహా కీలక వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో ఈ భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. గురువారం ఐటీబీపీ, ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీ, బస్తర్ బెటాలియన్.. స్థానిక పోలీసులు కలిపి మొత్తం 800 మంది భద్రతా బలగాలు ఈ భారీ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. నా



రాయణపూర్, బీజాపూర్, దంతేవాడ జిల్లాల పరిధిలో నిర్వహించిన ఈ జాయింట్ ఆపరేషన్‌లో నక్సలైట్ల స్థావరాన్ని గుర్తించి.. దానిపై బుల్లెట్ల వర్షం కురిపించారు. దీంతో పలువురు మావోయిస్టులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరికొందరు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది.

భద్రతా బలగాలు జరిపిన కాల్పులకు.. మావోయిస్టులు కూడా తిరిగి ఎదురు కాల్పులకు దిగారు. దీంతో దండకారణ్యం మొత్తం దద్దరిల్లిపోయింది. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని.. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య పరస్పరం కాల్పులు జరుగుతున్నట్లు సమాచారం.

ముందడుగు
శుక్రవారం, 24-5-2024, హైదరాబాద్

# కాళ్లు, చేయి లేకున్న ఎవరెస్ట్ ఎక్కాడు

## ఆశయానికి అంగవైకల్యం అడ్డే కాదని భావించాడు

ముందడుగు జాతీయం:

ఒక వ్యక్తి ఓ ప్రమాదంలో రెండు కాళ్లు, ఓ చేయి కొల్పోయాడు. ఐనా తన ఆశయానికి అంగవైకల్యం అడ్డే కాదని భావించాడు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించడమే లక్ష్యంగా పెట్టుకొన్నాడు. ఈ క్రమంలో ఎన్నో సవాళ్లను అధిగమించిన ఆ ముప్పైఏళ్ల యువకుడు.. ఎవరెస్టు శిఖరాన విజయ సంకేతం చూపించి ప్రపంచ రికార్డు సృష్టించాడు.




టింకేశ్ కౌశిక్.. తొమ్మిదేళ్ల ప్రాయంలోనే కరెంటు షాక్‌తో రెండు కాళ్లు, ఓ చేయి కోల్పోయాడు. కృత్రిమ అవయవాలను వాడుతున్నాడు. కొన్నేళ్ల క్రితం గోవాకు వచ్చిన కౌశిక్, ఫిట్‌నెస్ కోచ్‌గా పని చేస్తున్నాడు. ఎలాగైనా ఎవరెస్టును అధిరోహించాలని ఆశయంగా పెట్టుకున్న ఆయన.. అందుకోసం తీవ్రంగా శ్రమించాడు. మే 4 నేపాల్ నుంచి సాహసయాత్రను మొదలుపెట్టిన ఆయన మే 11న బేస్ క్యాంపుపై జాతీయజెండా ఎగురవేశాడు. ఈ క్రమంలో పలు సవాళ్లను ఎదుర్కొన్నట్లు చెప్పాడు.

మూడు అవయవాలు 90శాతం కోల్పోయి.. ఎవరెస్టును అధిరోహించిన తొలి వ్యక్తిగా కౌశిక్ రికార్డు సృష్టించారని గోవా వికలాంగ సంఘం పేర్కొంది. దివ్యాంగులకు ఆదర్శంగా నిలవడంతోపాటు గోవాకు ఇదెంతో గర్వకారణమని ఆ సంస్థ చీఫ్ అవెలినో డిసౌజా అభిప్రాయపడ్డారు. కౌశిక్ ఈ ఘనత సాధించడంపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ స్పందిస్తూ..రాష్ట్రం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ విజయం యువతకెంతో స్ఫూర్తిదాయకమని, ఆయనకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తున్నానని ట్వీట్ చేశారు.

# నీటి గుంతలో కూర్చొని మహిళ వినూత్న నిరసన

## హైదరాబాద్ నగర రోడ్ల పరిస్థితిపై ఆవేదన

ముందడుగు హైదరాబాద్:

హైదరాబాద్ నగర రోడ్ల పరిస్థితిపై నగరానికి చెందిన ఓ మహిళ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వినూత్న రీతిలో నిరసన చేపట్టింది. హైదరాబాద్‌లో చాలా చోట్ల రోడ్లన్నీ గుంతలుగా మారాయని, వరద నీరు మిగిలిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కనే ఉన్న వరద నీటి గుంతలో కూర్చొని వినూత్న రీతిలో ఆమె నిరసన తెలిపారు. నాగోలు బండ్లగూడ రహదారిలోని ఆనంద్ నగర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆ మహిళ పేర్కొన్నారు. రోడ్డు మధ్యలో ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.




కొత్త రోడ్డును నిర్మించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు నచ్చజెప్పినా ఆమె వినలేదు. రోడ్డును పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టమైన హామీ ఇస్తేనే నిరసన విరమిస్తానని ఆమెను కదలకుండా అలాగే నిరసన వ్యక్తం చేశారు. ఆమెకు మద్దతుగా స్థానికులు కొందరు నిలిచారు. దీంతో సదరు మహిళ నిరసనతో దిగివచ్చిన అధికార యంత్రాంగం రోడ్లు మరమ్మతులు చేపడతామని, అవసరైన చోట్ల కొత్తగా రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆమె తన నిరసనను విరమించారు.

# అస్సోం రాష్ట్రంలో అతిసార వ్యాధి కలవరం

- వారం వ్యవధిలోనే 11మంది మృతి
- మరణాలపై తక్షణమే స్పందించిన కేంద్రం




ముందడుగు అస్సాం:

అతిసార వ్యాధి అస్సాం రాష్ట్రాన్ని తీవ్ర కలవరానికి గురి చేస్తోంది. టిన్సుకియా జిల్లాలోని ఓ టీ ఎస్టేట్ లో డయేరియా కారణంగా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరంతా కేవలం వారం వ్యవధిలోనే మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో అపరిశుభ్రత, సరైన తాగునీరు లేకపోవడంతో అతిసార వ్యాధి బారిన పడి ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వారం వ్యవధిలోనే టీ ఎస్టేట్‌లో 11 మంది కార్మికులు అతిసార వ్యాధి కారణంగా మరణించడంపై కేంద్రం స్పందించింది. ఈ మేరకు అస్సోం మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితిని అంచనా వేయాలని అస్సోంప్రధాన కార్యదర్శి, టిన్సుకియా జిల్లా కమిషనర్‌ను ఆదేశించారు. వ్యాప్తి కారణంగా ప్రభావితమైన ప్రజలకు తక్షణ సాయం అందించాలన్నారు. మరోవైపు అస్సోం ఎమ్మెల్యే రూపేష్ గోవాలా కూడా టీ ఎస్టేట్‌ను సందర్శించి పరిస్థితిన సమీక్షించారు. వ్యాధి నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### ప్రత్యేక ఫ్యాషన్ బ్రాండ్

# బిగ్ హలో ప్రారంభం




ముందడుగు హైదరాబాద్: ప్లస్-సైజ్ వ్యక్తుల కోసం ప్రత్యేక ఫ్యాషన్ బ్రాండ్ బిగ్ హలో, హైదరాబాద్‌లో నాలుగు కొత్త స్టోర్‌లను ప్రారంభించడంతో రిటైల్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. కూకట్‌పల్లి, ఉప్పర్‌పల్లి, మియాపూర్ మరియు పంజాగుట్ట పరిసరాల్లోని బిగ్ హలో స్టోర్‌లు హైదరాబాద్ మరియు సికింద్రాబాద్ జంట నగరాల్లో నివసించే ప్లస్-సైజ్ పురుషులు మరియు మహిళల కోసం స్టైలిష్ మరియు హై-క్వాలిటీ ఫ్యాషన్ దుస్తులు మరియు ఉపకరణాలను అందిస్తాయి. "హైదరాబాదీలు తమ వ్యక్తిత్వాన్ని నిజంగా స్టైలిష్ మరియు బాగా సరిపోయే దుస్తుల ద్వారా వ్యక్తీకరించడానికి ఇష్టపడతారు, కానీ ఎక్కువ సంఖ్యలో ఉన్న వ్యక్తులకు, అలాంటి దుస్తులను కనుగొనడం ఎల్లప్పుడూ ఒక ఎత్తైన యుద్ధం. హైదరాబాద్‌లో బిగ్ హలో ప్రారంభించడం ఈ సమస్యను పరిష్కరిస్తుంది మరియు స్థానిక ప్రజలకు ప్రపంచ స్థాయి ఫ్యాషన్‌కు అందుబాటులోకి వస్తుంది మరియు రాజీ లేకుండా సరిపోతుంది, "అని సంపూర్ణ బ్రాండ్స్ మరియు రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు మరియు సిఈఓ విష్ణు ప్రసాద్ అన్నారు.

# చార్‌ధామ్ యాత్రకు లక్షల్లో భక్తులు

## రిజిస్ట్రేషన్ లేకుంటే వెనక్కి రావడమే ■ ఇప్పటికి 31లక్షల మందికిపైగా రిజిస్ట్రేషన్

ముందడుగు ఉత్తరాఖండ్:

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో చార్‌ధామ్ యాత్ర కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం యాత్రకు వచ్చే వారికి పలు సూచనలు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ లేకుండా యాత్రకు వచ్చే వారిని వెనక్కి పంపున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాధా అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు లేఖ రాశారు. చార్‌ధామ్ యాత్రకు భారీగా ప్రజలు వస్తుండడంతో ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటి వరకు యాత్ర కోసం 31లక్షల మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది.




ఈ క్రమంలోనే సీఎస్ రాధ అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు లేఖ రాశారు. ఏ రాష్ట్రానికి చెందిన పర్యాటకులైనా వస్తే ఏ రాష్ట్రానికి చెందిన యాత్రికులు రిజిస్ట్రేషన్ లేకుండా వస్తే ఆపేస్తామని ఆయన స్పష్టం చేశారు. చార్‌ధామ్ యాత్రకు రావాలనుకునే వారు రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న తేదీనే రావాలన్నారు. దాంతో యాత్రను సులభతరం చేస్తుందన్నారు. యాత్రికులందరికీ అవగాహన కల్పించాలని కోరారు. చార్‌ధామ్ యాత్రకు ఇప్పటివరకు 31,18,926 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కేదార్‌నాథ్‌లో 10.37లక్షలు, బద్రీనాథ్‌లో 9.55లక్షలు, గంగోత్రికి 5.54 లక్షలు, యమునోత్రికి 4.86లక్షల మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. హేమకుండ్ సాహిబ్ యాత్రకు ఇప్పటివరకు 84,427 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

ముందడుగు
శుక్రవారం, 24-5-2024, హైదరాబాద్

# వాడిన నూనెను పదే పదే వాడితే క్యాన్సర్..?

- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ హెచ్చరిక
- ఆరోగ్యం కోసం తాజా నూనె మంచిదని వైద్యులు సిఫార్సు



**ముందడుగు ప్రత్యేకం:**

ఒకసారి వంటకు వాడిన వేడిచేసిన నూనెను పదే పదే వాడితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ హెచ్చరించింది. సాధారణంగా అధిక ఉష్ణోగ్రతల వద్ద, నూనెలోని కొన్ని కొవ్వులు ట్రాన్స్ ఫ్యాట్‌లుగా మారుతాయి, ఇవి విషపూరిత సమ్మేళనాలను ఏర్పరుస్తాయి, ఇవి హృదయ సంబంధ వ్యాధులు మరియు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తెలిపింది.

## దీర్ఘకాలిక వ్యాధులు

నూనెను పదే పదే వేడి చేయడం వల్ల అందులోని అణువులు విచ్ఛిన్నమై, ఆల్డిహైడ్ వంటి హానికరమైన టాక్సిన్‌లు విడుదలై ఆమ్లంగా మారుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి జీర్ణవ్యవస్థను దెబ్బతీసి దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతాయని వైద్యులు చెబుతున్న ప్రధాన సైడ్ ఎఫెక్ట్. దీనిని నివారించడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. దీని ప్రకారం, ఆహారాన్ని తిరిగి వెలికితీసేందుకు ఒకసారి వేడిచేసిన నూనెను ఉపయోగించకూడదని హెచ్చరించింది.

## ఒకట్రెండు రోజుల్లోనే వాడాలి

ఒకసారి ఉపయోగించిన నూనెను ఫిల్టర్ చేసి కూరగాయలు, మాంసం మొదలైన వాటిని వేయించడానికి మసాలా చేయడానికి ఉపయోగించవచ్చని నివేదించబడింది. ఒకట్రెండు రోజుల్లో వండాలని, నిల్వ ఉంచి వాడవద్దని కూడా సూచించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఎల్లప్పుడూ వంట కోసం తాజా, ప్రాసెస్ చేయని నూనెలను ఉపయోగించాలని సిఫార్సు చేస్తోంది. వాడిన నూనెను అప్పుడప్పుడు మళ్లీ వాడటం పెద్ద సమస్య కానప్పటికీ, ఈ పద్ధతికి స్వస్తి చెప్పాలని వైద్యులు చెబుతున్నారు.

ఇవన్నీ కాకుండా పదే పదే వేడిచేసిన నూనెలో వండిన ఆహారం రుచి మారి ఒక రకమైన చేదును ఇస్తుంది. సాధ్యమైనంత ఉత్తమమైన ఆరోగ్యం, రుచి కోసం తాజా నూనెను ఉపయోగించమని వైద్యులు సిఫార్సు చేస్తారు.

# రైలు ప్రయాణంలో ఇన్ని సేవలు పొందొచ్చు

- సేవల్లో తేడా వస్తే ఇలా ఫిర్యాదు చెయ్యండి
- ప్రతి ఒక్కరు ఆరు ప్రయోజనాలు పొందవచ్చు

**ముందడుగు ప్రత్యేకం:**

రైలు ప్రయాణం అంటే చాలా సరదాగా ఉంటుంది. రైలులో ప్రయాణించాలంటే టికెట్ తప్పనిసరిగా ఉండాలి. ఈ విషయం అందరికి తెలుసు. కాని ఆ టికెట్‌తో ప్రయాణికులకు అనేక ప్రయోజనాలున్నాయనే విషయం మాత్రం చాలా మందికి తెలియదు. ఈ టికెట్ ద్వారా ప్రయాణికులు చాలా సౌకర్యాలను పొందవచ్చు. రైలు టిక్కెట్‌ల వల్ల ప్రయాణికులు ఆహారం నుండి ఎమర్జెన్సీ ట్రీట్‌మెంట్, ప్రసూతి వరకు అన్నింటినీ యాక్సెస్ చేయవచ్చు. మీరు దీని గురించి తెలుసుకోవాలి.



## మీరు ఈ అన్ని సౌకర్యాలను పొందుతారు

1. మీరు ధృవీకరించబడిన రైలు టిక్కెట్‌ని కలిగి ఉంటే బస చేయడానికి మీకు హోటల్ అవసరమైతే మీరు IRCTC డార్మిటరీని ఉపయోగించవచ్చు. ఇక్కడ మీరు మంచం చాలా చౌకగా దొరుకుతుంది. అంటే రూ. 150 వరకు ఉంటుంది. ఇది 24 గంటలు మాత్రమే చెల్లుబాటు అవుతుంది.

2. భారతీయ రైల్వేలలో, దిండు, బెడ్‌షీట్, బ్లాంకెట్ అన్నీ AC 1, 2, 3లలో ఉచితంగా లభిస్తాయి. ఈ సౌకర్యాలన్నీ గరీబ్ రథ్‌లో కూడా ఉచితంగా లభిస్తాయి. మీరు ACలో ఈ వస్తువులను పొందకపోతే మీ రైలు టిక్కెట్‌ను చూపడం ద్వారా మీరు వీటిని యాక్సెస్ చేయవచ్చు. దీని కోసం మీరు ఎలాంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

3. రైలులో ప్రయాణిస్తున్నప్పుడు మీకు అనారోగ్యంగా అనిపిస్తే లేదా మీకు ఏదైనా మెడికల్ ఎమర్జెన్సీ ఉంటే, రైల్లోనే పూర్తి ఫాస్ట్ ఎయిడ్ సౌకర్యం ఉంది. మీరు రైలు RPF జవాన్‌కు తెలియజేయాలి. కావాలంటే 139కి కాల్ చేయవచ్చు. మీరు వెంటనే ప్రథమ చికిత్స సౌకర్యం పొందుతారు. రైలులో మీకు కావాల్సిన సదుపాయం లేకపోతే, అది తదుపరి స్టేషన్‌లో ఏర్పాటు చేయబడుతుంది.

4. మీరు రాజధాని, దురంతో లేదా శతాబ్ది వంటి ప్రీమియం రైలులో టికెట్ బుక్ చేసినప్పటికి ఈ రైలు 2 గంటల కంటే ఎక్కువ ఆలస్యం అయితే మీకు IRCTC క్యాంటీన్ నుండి ఉచితంగా ఆహారం కూడా అందించబడుతుంది. మీకు ఆహారం ఇవ్వకపోతే, మీరు 139 నంబర్‌కు డయల్ చేయడం ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

5. అన్ని రైల్వే స్టేషన్లలో లాకర్ రూమ్, క్లోక్ రూమ్ సౌకర్యం ఉంది. అటువంటి పరిస్థితిలో, మీరు మీ వస్తువులను ఈ లాకర్ రూమ్‌లు, క్లోక్ రూమ్‌లలో సుమారు 1 నెల పాటు ఉంచవచ్చు. అయితే దీని కోసం మీరు 24 గంటలకు ₹ 50 నుండి ₹ 100 వరకు చార్జ్ చెల్లించాలి. అయితే దీనికి కూడా మీరు తప్పనిసరిగా రైలు టికెట్ కలిగి ఉండాలి.

6. అదే సమయంలో రైలు దిగిన వెంటనే లేదా ఎక్కే ముందు మీరు నాన్‌ఎసి లేదా ఎసి వెయిటింగ్ రూమ్‌లో హాయిగా వేచి ఉండవచ్చు. దీని కోసం మీరు మీ టిక్కెట్‌ను చూపించవలసి ఉంటుంది. ఇక్కడ ఉండడానికి ఎలాంటి ఛార్జీ లేదు.

**ఇక్కడ ఫిర్యాదు చేయండి:**


మీ దగ్గర కన్ఫర్మేషన్ టిక్కెట్‌ని కలిగి ఉంటే మీరు ఈ అన్ని సౌకర్యాలలో ఏదైనా సమస్యను ఎదుర్కొన్నట్లయితే లేదా మీరు వీటిలో దేనినైనా ప్రయోజనం పొందలేకపోతే వెంటనే మీరు 139కి డయల్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. మీకు వెంటనే సహాయం అందుతుంది.

# బెంగుళూర్ రేవ్ పార్టీలో తెలుగు వారే ఎక్కువ

- పలువురు డ్రగ్స్ వాడినట్లు నిర్ధారణ
- వ్యభిచారం కూడా జరిగి ఉండొచ్చన్న అనుమానం

**ముందడుగు క్రైం:**

బెంగళూరు రేవ్ పార్టీ కేసులో రోజుకో విషయం వెలుగుచూస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురు వాసు, అరుణ్, సిద్ధిఖీ, రన్ ధీర్, రాజ్‌భవ్ లను అరెస్ట్ చేశారు. వాసు బర్త్ డే పార్టీ పేరుతో నిర్వహించిన రేవ్ పార్టీలో డ్రగ్స్ వాడినట్లు పోలీసులు నిర్థారించారు సిద్ధిఖీ, రన్ ధీర్, రాజ్‌భవ్ లను డ్రగ్స్ పెడ్లర్లుగా చేర్చి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పార్టీ నిర్వాహకుడైన వాసు .. బెజవాడలోని చిట్టినగర్ కు చెందినవాడుగా గుర్తించారు పోలీసులు. అయితే తాజాగా.. ఈ పార్టీలో వ్యభిచారం కూడా జరిగి ఉండొచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. పార్టీ జరిగిన జీఆర్ ఫాంహౌస్ హైదరాబాద్ కు చెందిన గోపాల్ రెడ్డికి చెందినదిగా గుర్తించారు. ఈ రేవ్ పార్టీలో మొత్తం 200 మంది పాల్గొనగా.. ఎంట్రీ ఫీజు రూ.2 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల నుంచే ఎక్కువమంది వెళ్లినట్లు తెలుస్తోంది. రేవ్ పార్టీలో




డ్రగ్స్ వాడటంతో.. విచ్చలవిడిగా వ్యభిచారం కూడా జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రేవ్ పార్టీకి క్రికెట్ బుకీలు, సినీ ఇండస్ట్రీకి చెందినవారు, రాజకీయ నేతలు హాజరయ్యారు. అరెస్ట్ చేసిన ఐదుగురి బ్లడ్ శాంపిల్స్ ను ఇచ్చినట్లు సమాచారం. పార్టీ నిర్వాహకుడైన వాసు నేర చరిత్రపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ కేసును బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ స్టేషన్ నుంచి సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ కు బదిలీ చేశారు.

# ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డుకు పోలీసు వాహనం

## నర్సింగ్ ఆఫీసర్ ను అరెస్టు చేసిన పోలీసులు

**ముందడుగు ఉత్తరాఖండ్:**

ఎయిమ్స్ రిషికేశ్ సర్జరీ యూనిట్‌లో విధుల్లో ఉన్న సమయంలో నర్సింగ్ ఆఫీసర్ తనను లైంగికంగా వేధించారంటూ రెండురోజుల క్రితం ఒక జూనియర్ డాక్టర్ ఆరోపించారు. అతడు తనకు అసభ్యకర సందేశాలు పంపినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఇతర వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని తొలగించాలంటూ వారు నిరసన చేపట్టారు. ఈ క్రమంలోనే నర్సింగ్ ఆఫీసర్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు రాగా.. బయట ఆందోళన చేస్తున్న సిబ్బందిని చూసి తమ వాహనంతో నేరుగా ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లిపోయారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసు వాహనం లోపలికి



వెళ్తున్న వీడియోలో బెడ్లపై పేషంట్లు కనిపించారు. ఎస్‌యూవీ వస్తుండగా.. కొందరు భద్రతా సిబ్బంది అది వెళ్లడానికి దారిని సిద్ధం చేశారు. అలాగే నిందితుడిని అరెస్టు చేసినప్పుడు పోలీసులు అక్కడి వైద్యులను అదుపు చేయడం ఆ దృశ్యాల్లో కనిపించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇలా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎయిమ్స్ యాజమాన్యం అతడిపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆ శిక్ష సరిపోదని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్లు వ్యక్తమయ్యాయి.